
# ఎవరికి వారేదే




నిరంజనం తెల్ల కాగితాలూ, కలమూ తీసుకుని టేబుల్ దగ్గరకు చేరినప్పుడు అతని మిత్రుడు, రూమ్మేటు అయిన పరాత్పరరావు పడక్కుర్చీలో వెనక్కువాలి భయంకరమైన హారర్ డిటెక్టివ్ నవల చదువుతున్నాడు.

చదువుతూనే ఎందుకో ఒక్కసారి తలతిప్పి నిరంజనాన్ని చూసి "కథ రాసే ప్రయత్నమేనా?" అనడిగాడు ఎదురుగా వున్న రచనా సామగ్రిని చూస్తూ. అంతేకాకుండా నిరంజనం సిగరెట్టు కాలుస్తున్నాడు- కథ రాయబోయే ముందు ఆరంభంగా అతను ఓ

సిగరెట్టును బూడిదగా మారుస్తాడు.

తల వూపాడు నిరంజనం.

"ఏ కథ? పదహారణాల ప్రేమ కథేనా?" నవ్వుతూ అడిగాడు పరాత్పరరావు.

ఈసారి నిరంజనం తలవూపకుండా "అవును. ప్రేమకథే! దీని పేరు కూడా అదే" అన్నాడు.

దాదాపుగా నిరంజనం అన్నీ ప్రేమకథలే రాస్తుంటాడు. ఒకరకంగా అతను ప్రేమకథల స్పెషలిస్టు... అతన్లా ప్రేమకథలు రాయగలిగిన రచయితలు చాలా కొద్దిమంది. కాని అతను కేవలం ప్రేమకథలే రాయటానికి ప్రత్యేకించి ఏ కారణమూ లేకపోయినా అలాంటి కథలతో అందమైన అమ్మాయిల అభిమానాన్ని చూరగొనాలనే ఆలోచన ఎక్కడో అతన్లో వుండివుండొచ్చు.

పరాత్పరరావు కుర్చీలోనుంచి లేచి టేబిల్ దగ్గరగా వచ్చి అక్కడే వున్న గాద్రెజ్ కుర్చీలో కూర్చుంటూ "సారీ గురూ... నీ మూడ్ చెడగొడుతున్నందుకు మరోసారి సారీ... ఏమయినా ఈరోజు ఈ సబ్జెక్టు గురించి కొంత వాదన తప్పదు" అన్నాడు.

నిరంజనం అందుకు నవ్వి "ఈరోజు నీ మూడ్ బాగోలేదు. అందుకే భయంకరమైన హారర్ డిటెక్టివ్ నవలను వదిలి నాదగ్గరకు వచ్చావు" అన్నాడు.

"సరే... ఇక మాట్లాడుతాను. నువ్వు రాసే ఈ ప్రేమకథల వల్ల సమాజానికి ఏమిటి ప్రయోజనం?" అనడిగాడు పరాత్పరరావు.

"సమాజమంటే ఎవరు? మనమే కదా? అంటే అందులో నువ్వూ, నేనూ కూడా వున్నాం. నీ గురించి నాకు తెలీదుకాని నా వరకు నా కథల వ్లల తగిన ప్రయోజనమే వుంది. నా కథలను ప్రచురించిన పత్రికల నించి నాకు పారితోషికం వస్తుంది. రచయితగా గుర్తింపు కూడా వస్తుంది" అన్నాడు నిరంజనం వెంటనే.

"నువ్వు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవటం లేదు నిరంజనం కాని నేను సీరియస్‌గానే అడుగుతున్నాను. ఈ సమాజంలో నువ్వు కథలు రాయటానికి కేవలం ప్రేమే కాకుండా ఇంకెంతో మెటీరియల్ వుంది. అవినీతి, స్త్రీ బానిసత్వం, నిరుద్యోగం లాంటివి ఎన్నో సమస్యలు మన చుట్టూ వున్నాయి. వాటిని ఇతివృత్తాలుగా తీసుకుని కథలు రాస్తే వాటివల్ల సాంఘిక ప్రయోజనం వుంటుందని నా ఉద్దేశ్యం. మరి నువ్వు రచనలు చేయగలిగిన శక్తివుండీ అలాంటి కథలు ఎందుకు రాయకూడదు?" అనడిగాడు పరాత్పరరావు టేబిల్‌మీది సిగరెట్టు పెట్టెను అందుకుంటూ-

అతనికి నిరంజనం వెంటనే జవాబు చెప్పలేదు. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది. గాలికి కాగితాలు కదులుతున్నాయి.

సిగరెట్‌ముక్కను యాష్ ట్రేలో నొక్కి ఇలా అన్నాడు నిరంజనం-

"డియర్ ఫ్రెండ్! నువ్వు అడిగిన దాన్లో కొంత నిజముంది. కాని ఏ రచనకైనా కొన్ని ప్రయోజనాలు వుంటాయి. ఒక్కటే ప్రయోజనం వుంటుందంటే నేను ఒప్పుకోను. ఓ కథకు ఎన్నో ప్రయోజనాలు వుంటాయి. ఇక్కడ ప్రయోజనం అనే మాటకు ఎంతో విస్తృతమైన అర్థం వుంది. అంటే విషాదంలో మునిగివున్న ఓ మనిషికి నేను రాసిన సరదా ప్రేమకథ కొంత రిలీఫ్ ఇవ్వగలిగిందంటే నా కథకు కొంత ప్రయోజనం వున్నట్టే కదా! నువ్వు ఎంతకీ రానిరైలు గురించో, బస్సు గురించో ఎదురు చూస్తూ ఉంటావు. విసుగ్గా వుంటుంది. ఆ సమయంలో ఓ నాలుగు ప్రేమ కథలు చదువుతూ నీ విసుగునూ, కాలాన్ని మరచి పోయావనుకో... అప్పుడు ఆ కథలకు విసుగును మరిపింపచేసీ, ఎదురు చూపు అనే ఇబ్బందినుండి తప్పించే ప్రయోజనం వున్నట్టే అన్ని కథలూ సమాజాన్ని ప్రక్షాళన చేసేవే ఐతే తెలుగు పాఠకులు ఏ కథల పత్రికనూ ముట్టుకోరు. సమాజంలో అవినీతితో పాటు ఇంకొన్ని వున్నాయి. అవే మనుషుల మధ్య కనిపించని అనుబంధాలు, ఆప్యాయతలు, ప్రేమ, అనురాగం లాంటివి. మనిషికీ మనిషికీ మధ్యవున్న సంబంధాలు మనుషుల్లో అంతర్గతంగా దాగివున్నా ఎన్నో కోణాల నుంచి, ఎన్నో వందల కథలు రాసుకోవచ్చు. నా దృష్టిలో వాటికే విలువ ఎక్కువ. అందుకే నేను అలాంటి కథలే రాస్తాను"

అప్పుడు పరాత్పరరావు కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాడు. ఎందుకంటే నిరంజనం ఈ విధమైన ఉపన్యాసాన్ని ఇస్తాడని అతను వూహించలేదు. అతని దృష్టిలో అప్పటివరకు దొంగల గురించీ, ఆకలి చావుల గురించీ అవినీతి గురించీ, రాసిన కథలే సమాజానికి పనికొచ్చే కథలనీ, మిగిలినవన్నీ అసలు కథలు కాదనే ఆలోచన ఒకటుంది. కానిదాన్ని రచయిత ఐన నిరంజనం ఒప్పుకోవడం లేదు.

ఇప్పుడెలా?

ఐనా పరాత్పరరావు పట్టువదలని విక్రమార్కుడిలా "సరే... ఐతే ఆకలిచావుల గురించీ అవినీతి గురించి నువ్వు కథలు రాయలేవా?" అడిగాడు.

నవ్వాడు నిరంజనం.

నవ్వి, "ఒక రకంగా రాయలేనేమో ఐతే! రాయకూడదనే నియమం నాకు లేదు. కొంత మంది రచయితలు కొన్ని రకాల కథలను బాగా రాయగలరు. నువ్వన్నట్టుగానే పేదల కష్టాల గురించి, అవినీతికి నిలయమైన మనుషుల గురించి, లేక చీకటి వ్యాపారం చేసే ఓ మనిషి గురించి నేను కథలు రాశాననుకో నా కథలను వాళ్ళంతా చదువుతారంటావా? చదవొచ్చు. కాని నా కథల వల్ల వాళ్ళందరిలో మార్పు వస్తుందంటావా? రాదు. ఎందుకంటే సమాజప్రయోజనం గురించి కథలు రాస్తున్న రచయితల్లోనే వాళ్ళు రాస్తున్న కథలపట్ల

విశ్వాసం లేదు. కేవలం పేదల గురించే కథలురాసే రచయిత ఓ పేదల పత్రికకు ఉచితంగా ఓ కథ రాసి ఇవ్వడు.

తాగుడు మానమంటూ హెచ్చరికలు చేస్తూ నవలలు రాసే మరో రచయిత ఆ నవలకు వచ్చిన రెమ్యూనరేషన్‌తోనే బార్‌కు వెళ్ళి కూర్చుంటాడు. ముష్టివాళ్ళగురించి జాలికలిగేలా కథలు రాసే ఓ మనిషి వాళ్ళను చూడగానే అసహ్యించుకుంటాడు. ఇలాంటి వాళ్ళు కొంతమంది నాకు తెలుసు. ఇలాంటి రచయితలు రాసే కథలన్నీ వాళ్ళ విషయంలోనే ఎలాంటి ప్రయోజనాన్ని కలిగించలేకపోతున్నాయి. ఇక వాటికి సమాజంలో కుళ్ళును కడిగివేసే శక్తి వుంటుందంటే నేను ఒప్పుకోను. అందుకే ఇకనువ్వు సమాజానికి ప్రత్యేకంగా ప్రయోజనం కలిగించే కథలు ఏవో వుంటాయనే ఆలోచనను వదిలెయ్యి" అన్నాడు మరో సిగరెట్టు వెలిగిస్తూ-

భారంగా నిట్టూర్చాడు పరాత్పరరావు. అతనికి ఏదో మత్తు వదిలినట్లుగా అనిపించింది. నిరంజనం చెప్పినదంతా అతనికి ఎంతో క్లియర్‌గా వుంది.

నిజమే- సమాజం కోసం రాసే ఆ కథలన్నీ నిజంగా సమాజానికి ఉపయోగ పడుతున్నాయా? సమస్యలను తన కథల్లో ప్రెజెంట్ చెయ్యటం తప్పించి రచయిత చెయ్యగలిగింది ఏముంది? ఒకవేళ ఆ సమస్యలకు అతను పరిష్కారం చూపినా దాన్ని ఎంతమంది అనుసరిస్తారు?

మిత్రుడికి థాంక్స్ చెప్పాడు పరాత్పరరావు.

"ఒక రకంగా ఇన్నాళ్లూ రచయితగా నిన్నూ, నీ కథలనూ తక్కువ అంచనా వేసుకొన్నాను. సరే. ఇక సమాజ ప్రయోజనం కథల గురించి నేను నీ దగ్గర మాట్లాడను. ఈ రోజునే నాకు ఓ ఆలోచన వచ్చింది. నువ్వో మనిషి గురించి కథరాయాలి" అన్నాడు.

"ఎవరామనిషి?" కుతూహలంగా అడిగాడు నిరంజనం. "మన ఎదురింట్లో వుంటున్న శ్యామల గురించి"

"శ్యామలా?"

"అవును. అప్పటికి నువ్వు ఇంకా రూముకు రాలేదు కాని ఆ ఇడియట్ ఆమెను ఘోరంగా కొట్టి బయటకు వెళ్ళిపోయాడు- తూలుకుంటూ. కిటికీ తలుపులు తెరిచే వున్నాయి. రోడ్డున వెళ్ళే మనుషులు కూడా ఆగిపోయి వాడు బయటకు వెళ్ళేవరకు వుండి వెళ్ళిపోయారు. శ్యామలను చూస్తే నాకు జాలిగా వుంది. అందుకే ఆమె గురించి నువ్వు కథ రాయాలి"

నిరంజనం మాట్లాడలేదు.

ఎదురింట్లో వుండే శ్యామల ఇప్పుడు తాగి వచ్చి తనని దారుణంగా హింసిస్తున్న ఆ ఇడియట్ కోసం అందర్నీ వదలి ఎంతో దూరంనుంచి వచ్చేసింది. వాడామెను పెళ్ళి చేసుకున్నాడో లేదో ఎవరికీ తెలీదు. ఆమెమీది ఆకర్షణ, వ్యామోహం పోయిన తర్వాత వాడామెకు నరకాన్ని చూపుతూనే వున్నాడు. శ్యామల అన్నింటినీ భరిస్తూనే వుంది.

కొంచెం సేపటి తర్వాత నిరంజనం అన్నాడు-

"నాకూ శ్యామల గురించి కథ రాయాలనే వుంది. కాబట్టి తప్పకుండా ఈరాత్రి ఆమె కథే రాస్తాను"

"గుడ్... నువ్వా కేవలం కథ రాయటమే కాదు. ఆమె అనుభవిస్తున్న జీవితం నుంచి ఆమెకు మరో వెలుగున్న దారిని, పరిష్కారాన్ని కూడా అందులో చూపించు. బతుకు మీద ఆశకలిగేలా ఆమెకు అందులోనే ఓ దారిచూపు.... ఆ కథ అచ్చవగానే దాన్ని ఎలాగైనా శ్యామలకు నేను అందజేస్తాను" అన్నాడు పరాత్పరరావు.

సరేనన్నాడు నిరంజనం.

ఇక ఎవరిపనుల్లో వారు మునిగిపోయారు. భయంకర హారర్ డిటెక్టివ్ నవలను చదవడం ముగించి నిద్రపోయాడు పరాత్పరరావు. ఆ రాత్రి ఒంటిగంటవరకు కూర్చుని శ్యామల కథను పూర్తిచేశాడు నిరంజనం. అతను ఆ కథకు "ఓ జాలికథ" అనే పేరు పెట్టాడు. అందులో అతను శ్యామల ఆ దుర్మార్గుడిని వదిలి వెళ్ళి ఎక్కడో ఓ కుట్టుమిషనుతో తన జీవితాన్ని ప్రశాంతంగా వెళ్ళదీసినట్టూ ఆ తర్వాత ఆమెను ఓ విశాలహృదయం కలిగిన మగాడు పెళ్ళి చేసుకున్నట్టూ రాశాడు.

తెల్లవారిన తర్వాత ఆ కథను చదివి చాలా బావుందని మెచ్చుకున్నాడు పరాత్పరరావు. ఆ రోజునే ఆ కథను "ఎండమావి" అనే ఓ వారపత్రికకు పోస్టుచేశాడు నిరంజనం.

ఆ తర్వాత మళ్ళీ సాధారణ ప్రేమకథలనే రాశాడు అతను-

నెలరోజుల తర్వాత ఒకరోజు వూహించని విధంగా నిరంజనం పంపిన "ఓ జాలి కథ" తిరిగొచ్చింది. ఆరోజునే పోస్టులో అతనికి "ఎండమావి" వారపత్రిక కాపీ కూడా వచ్చింది. అందులో అతను రాసిన "ప్రేమలోనే వుంది" అనే కథ వేశారు.

శ్యామల గురించి రాసిన కథ తిరిగిరావటం మిత్రులిద్దరికీ విచారాన్ని కలిగించింది. తప్పకుండా ఆ కథ అచ్చవుతుందనుకున్నారు.

ఐతే ఆవారం "ఎండమావి" వారపత్రికలో తన కథతోపాటు మందాకిని పేరుతో వచ్చిన "ఇదొక్కటే దారి" కథ చదివిన తర్వాత తను శ్యామల గురించి రాసిన "ఓ జాలి కథ" ఎందుకు తిరిగి వచ్చిందో నిరంజనానికి అర్థమయ్యింది.

రెండు కథల్లోనూ వున్న థీమ్ ఒక్కటే- ఐతే ఆ కథలో శ్యామల పాత్ర కలిగిన స్త్రీ భర్త పెట్టే హింసలకు తట్టుకోలేక మగజాతి అంతా ఇంతే అనుకుని, జీవితం మీద విరక్తి కలిగి చివరకు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంటుంది.

ఆ కథను పర్వతరావు కూడా చదివి "నిజంగా నమ్మలేకుండా వున్నాను. ముగింపు తప్పించి ఈ కథలు రెండూ ఒకేలా వున్నాయి. అందుకే నీకథను పంపేశారు. ఐనా మనకు తెలిసిన ఈ శ్యామల గురించి మరెవరో కథ రాయటం ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

"ఇందులో ఆశ్చర్యపడటానికి ఏమీ లేదు. ఇలాంటి మనుషుల గురించి ప్రతిరోజూ ఎన్నో పత్రికలు వార్తలుగా వేస్తున్నాయి. కాని చివర్లో ఆ మనిషికి చావును పరిష్కారంగా చూపడం ఎందుకో నాకు యిష్టం లేదు. ఎందుకంటే చావు ఏ సమస్యకూ పరిష్కారం కాదు కాబట్టి" అన్నాడు నిరంజనం.

"నిజమే ఇందుకు నేనుకూడా ఒప్పుకుంటాను. ఎందుకైనా మంచిదే. ఈసారి "ఎండమావి" వారపత్రిక ఆఫీసుకు వెళ్ళినపుడు, ఈ కథ రాసిన మనిషి ఎవరో ఎంక్వయిరీ చెయ్యి" అన్నాడు పరాత్పరరావు.

ఐతే- ఆ తర్వాత రెండు రోజులకే ఎదురింట్లో వుంటున్న శ్యామల నిద్రమాత్రలు మింగి చనిపోయిందని తెలిసికొన్నప్పుడు ఎంక్వయిరీ చెయ్యకుండానే "ఇదొక్కటే దారి" కథను ఆమే రాసిందని వాళ్ళకు తెలిసి పోయింది.

(4 -4-1986 మయూరి వారపత్రికలో ప్రచురితం)